సాక్షి సంగారెడ్డి

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



రోడ్లపైనే వడ్లు

వడ్లు ఆరబెట్టుకునేందుకు రైతులు రోడ్లను ఆశ్రయిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వివరాలు IIలో ▸



హెచ్ఎం ఔదార్యం

అచ్చంపేటలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేసవి శిబిరం ప్రారంభించి విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. వివరాలు IIలో ▸



బస్ షెల్టర్ లేక రోడ్లపై పాట్లు

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

'బసవ జయంతి'కి సీఎం రేవంత్‌కు ఆహ్వానం



సీఎం రేవంత్‌ను కలిసిన రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం నిర్వహించే విశ్వగురువు మహా మానవతావాది మహాత్మ బసవేశ్వరుడి జయంతి వేడుకలకు హాజరుకావాలని రాష్ట్రీయ బసవదళ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. ఈ మేరకు ఈ సంఘం తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, ఎంపీ సురేశ్ షెట్కార్, లింగాయత్ సమాజ్ నాయకులతో వెళ్లి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ...బసవేశ్వరుడి 892వ జయంతి వేడుకలను రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. జిల్లాతోపాటు జహీరాబాద్, నారాయణఖేడ్‌ల నుంచి రాష్ట్రీయ బసవదళ్ శ్రేణులు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



బీబీపేట్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీబీపేట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జొన్నలను ఈ కేంద్రాల్లో కొనుగోలు చేయడం ద్వారా రైతులు మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. ధరణిలో తప్పుల కారణంగా ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం తెచ్చిందని ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ గుండు మోహన్, నాయకులు వినోద్ పాటిల్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రామికభవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 1886 మే 01న అమెరికాలోని చికాగోలో కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె జరిపితే కార్మిక వర్గం పై ఆనాటి పాలకులు కుట్రలు కుతంత్రాలతో విచ్ఛిన్నం చేసిందని, ఆ పోరాటంలో నలుగురు కార్మికులు చనిపోయారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కార్మిక చట్టాలను పూర్తిగా తుంగలో తొక్కి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయరాం, దుర్గా, చంద్రకిరణ్‌సింగ్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి



నాయీబ్రాహ్మణులతో అందోల్ కృష్ణ

సంగారెడ్డి: నాయీబ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సర్పంచుల ఐక్య వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అందోల్ కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దశబ్దాల తరబడి నాయీబ్రాహ్మణులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో నాయీబ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం వృత్తి జీవనంలోనే జీవితాలు వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపారు.



పూల సోయగం

హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో గ్రామాలన్నీ పచ్చందాలు సంతరించుకుంటున్నాయి. కంది మండలంలోని బేగంపేట్, చిద్రుప్ప, ఆరుట్ల, చేర్యాల, ఇంద్రకరణ్, ఇప్పలగడ్డ తండా, కలివేముల, చర్లగూడెం, మక్తలూరు, జుల్కల్ తదితర గ్రామాల్లో ఆరేళ్ల క్రితం రహదారులకు ఇరువైపులా నాటిన గులమోర్ మొక్కలతో పాటు పచ్చని పూల చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

- కంది(సంగారెడ్డి)



నిరసన గళం

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా కంది ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ అమాయకమైన భారతీయులపై జరిగిన ఈ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐఐటీ అధ్యాపక బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సంగారెడ్డి రూరల్

చేయూతపై చిగురిస్తున్న ఆశలు

కొత్త పెన్షన్ల మంజూరుకు కసరత్తు

- దివ్యాంగులు, వితంతువులకు ప్రాధాన్యం
- మూడేళ్ల తర్వాత మంజూరు



సంగారెడ్డి జోన్: కొత్తగా పెన్షన్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో అర్హులైన వారి జాబితాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అందించే పథకాలలో వివిధ పథకాలతో పాటు పింఛన్ల కోసం అధికంగానే దరఖాస్తు చేసుకున్నారు.

అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్న సెర్ప్

కొత్తగా మంజూరు చేసే పింఛన్లలో మొదటగా దివ్యాంగులతోపాటు వితంతువులకు అందించేందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు సమాచారం. అర్హులైన వారి జాబితాలను పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు సిద్ధం చేయనున్నారు.

జిల్లాలో 1,55,837 మంది పింఛనుదారులు

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి చేయూత పథకం ద్వారా ప్రతి నెలా పింఛను అందిస్తుంది. ఈ పథకం ద్వారా వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, కల్లుగీత కార్మికులు, డయాలసిస్, చేనేత వారికి పింఛన్ అందిస్తున్నారు. ఇందులో దివ్యాంగులకు రూ.4,016, ఇతరులకు రూ.2,016లను అందిస్తుంది. ఈ మేరకు జిల్లాలో వివిధ కేటగిరీలలో 1,55,837 మంది చేయూత ద్వారా రూ.36,15,19,230లు లబ్ధిపొందుతున్నారు. ఆయా లబ్ధిదారులకు పోస్టాఫీసుతోపాటు బ్యాంకుల ద్వారా చెల్లింపులు కొనసాగుతున్నాయి.

జిల్లాలో పింఛన్ వివరాలు

దివ్యాంగులు	14,465
వృద్ధులు	59,083
వితంతువులు	70,673
ఒంటరి మహిళలు	7,475
చేనేత కార్మికులు	683
కల్లుగీత కార్మికులు	813
బీడీ కార్మికులు	112
ఇతరులు	2,533

మూడేళ్లుగా కొత్త పెన్షన్లు లేవు

అర్హులైన వారు చేయూత పథకం లబ్ధిపొందేందుకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. 2022 ఆగస్టు 31న నుంచి కొత్తగా పెన్షన్లు మంజూరు కాలేదు. దీంతో వందల మంది ఈ పథకానికి దూరంగా ఉన్నారు. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు వేస్తున్నారు. తాజాగా పెన్షన్ల మంజూరు ప్రక్రియ ఊపందుకోవడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. తమకు గతంలో పింఛను వచ్చేదని గత కొన్నేళ్లుగా రావటం లేదని, అన్ని అర్హతలు కలిగి ఉన్నా పింఛను మంజూరు కావటం లేదని తదితర కారణాలతో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో అర్జీలు పెట్టుకున్న సందర్భాలున్నాయి. త్వరితగతిన మంజూరు చేయాలని పింఛనుదారులు కోరుతున్నారు.

భూ భారతిపై అవగాహన ఉండాలి

- ఖేడ్‌లో ఆర్వోఆర్ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- సాదాబైనామాల పరిష్కారానికి మార్గదర్శకాలు: కలెక్టర్ క్రాంతి



భూ భారతి అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ క్రాంతి

నారాయణఖేడ్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కొత్తగా ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టంపై రైతులు అవగాహన ఏర్పరుచుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్‌లో మంగళవారం నిర్వహించిన భూ భారతిపై అవగాహన సదస్సుకు కలెక్టర్ వల్లూరు క్రాంతితోపాటు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....భూ సమస్యలు ఉన్న రైతులు ఏడాదిలోగా భూ భారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కారమవు తాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు ఆర్డీఓ, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని చెప్పారు. ఒకవేళ అక్కడ కూడా పరిష్కారం కాకుంటే సీసీఎల్ఎతో పాటు ల్యాండ్ ట్రిబ్యునల్‌కు సైతం అప్పీల్ చేసుకునే అవకాశముందని తెలిపారు. రుణమాఫీ, ఇళ్లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్, లబ్ధిదారులకు సన్నబియ్యం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ప్రతీ సంవత్సరం ప్రదర్శనకు రికార్డులు

జోగిపేట(అందోల్)/వట్‌పల్లి (అందోల్): ప్రతీ గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి ప్రతి ఏటా గ్రామాల్లో రికార్డులను ప్రదర్శనకు ఉంచుతారని కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో పరిపాలనా అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకుంటోందని వివరించారు. ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించదని తెలిపారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడతాయని చెప్పారు. అనంతరం జోగిపేట, వట్‌పల్లిలో భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడుతూ...భూముల సరిహద్దులను సైతం జీపీఎస్ సిస్టమ్‌తో భూభారతి ద్వారా హద్దులు తెలుసుకునేందుకు వీలుందన్నారు. భూ భారతిలో రికార్డుల సవరణ, మ్యూటేషన్‌కు ముందే మ్యాప్ తయారు చేయడం, పాసు బుక్కులోనే భూమి పటం వంటి నూతన అంశాలు ఉన్నా యని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఖేడ్ ఆర్డీఓలు, అశోక చక్రవర్తి, పాండు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు

శాంతి సమావేశంలో ఎస్పీ పరితోశ్ పంకజ్



ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న స్థానిక నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని ఎస్పీ పరితోశ్ పంకజ్ స్పష్టం చేశారు. జిన్నారం మండల కేంద్రంలోని తాబేలుగుట్ట శివాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విగ్రహధ్వంసం ఘటనపై మంగళవారం ఎస్పీ ఆధ్వర్యంలో ఇరువర్గాల సమక్షంలో శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు అదనపు ఎస్పీ సంజీవరావు పాల్గొన్నారు. విగ్రహాన్ని కోతులు ధ్వంసం చేసినట్లు సీసీటీవీ ఆధారంగా ఈ సమావేశంలో నిర్ధారించారు. విగ్రహ ధ్వంసం ఘటనలో 28 మందిపై కేసులు నమోదు చేయగా 18 మందిని అదుపులోకి తీసుకుని సంగారెడ్డి జిల్లా కంది జైలుకు రిమాండుకు తరలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ..పటాన్‌చెరు ప్రాంతం మతసామరస్యానికి ప్రతీకగా ఉండేదని ఇటువంటి ఘటనతో ఈ ప్రాంతం వెనకబడటమేకాకుండా అభివృద్ధికి భంగం కలిగే ప్రమాదం ఉందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు సమాచారాన్ని చూసి వాస్తవాలు తెలుసుకోకుండా విద్వేషాలు రెచ్చగొట్టవద్దని చెప్పారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కావద్దని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దాడికి సంబంధం లేని కొందరి వ్యక్తులను అరెస్ట్ చేశారని వారిని విడుదల చేయాలని స్థానిక నాయకులు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు నయీముద్దీన్, నరేశ్, జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి, స్థానికనాయకులు మాజీ జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలతో లీఫార్మా చెలగాటం

జిన్నారం (పటాన్‌చెరు): పారిశ్రామికవాడ ప్రజల ప్రాణాలతో లీఫార్మా పరిశ్రమ యజమాన్యం చెలగాటమాడుతోందని గడ్డపోతారం గ్రామస్తులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పారిశ్రామికవాడలోని లీ ఫార్మా యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టారీతిన విషవాయువులను విడుదల చేస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుందని వాపోయారు. పరిశ్రమ వ్యవహరిస్తున్న తీరుపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేశామన్నారు. చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమ విడుదల చేస్తున్న విషవాయువులు చిన్నారులు, వృద్ధులు, మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పీసీబీ అధికారులను కోరారు. ఇటీవల పెద్ద ఎత్తున పరిశ్రమ పొగ గొట్టాల నుంచి విషవాయువులు విడుదల చేసిన విషయాన్ని అధికారులకు తెలియజేశారు.

నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోండి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల ప్రకారమే నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని లేకుంటే ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతారని వివరించారు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, అనంతరం సమీపంలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్‌కు సూచించారు. ఏ గ్రామంలోనైనా నీటి సమస్య ఉందా?అని అడిషనల్ కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ వనజ, ఏపీఓ రంగారావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో ఉన్న సంగారెడ్డి, జోగిపేట, బాచుపల్లి మహాత్మా జ్యోతి బాపూలే కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నవనీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులున్నాయని, పదవ తరగతి మార్కుల ఆధారంగా సీట్ల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని మే 12వ వరకు దరఖాస్తు చేసుకునే గడువు ఉందని తెలిపారు.

సొంత విత్తనంతోనే మనుగడ

- ప్రపంచ విత్తన వారోత్సవంలో విత్తన శాస్త్రవేత్త గౌరీ శంకర్
- ప్రదర్శనకు అరుదైన విత్తన రకాలు
- జన్యుమార్పిడి హైబ్రిడ్ రకాలతో ముప్పు
- అధికంగా విత్తనాలు ప్రదర్శించిన మహిళా రైతులకు ప్రోత్సాహకాలు



దేశీ విత్తనాలను ప్రదర్శనకు ఉంచిన మహిళా రైతులు

జహీరాబాద్: నేడు ప్రపంచం అంతా వ్యవసాయం, ఆహార వ్యవస్థలలో పోగొట్టుకున్న విత్తనాలు, పద్ధతులను మళ్లీ వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోందని విత్తన శాస్త్రవేత్త గౌరీ శంకర్ పేర్కొన్నారు. సొంత విత్తనాలతోనే వ్యవసాయ మనుగడ ఆధారపడి ఉందన్నారు. మనం సొంత విత్తనాలు దాచుకోవడం, వాటి విశిష్టతను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందని తెలిపారు. జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ విత్తన వారోత్స కార్యక్రమంలో ఆయనతో పాటు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య పాల్గొని మాట్లాడారు. ఎన్నో దశాబ్దాలుగా ఈ పద్ధతులు కాపాడుకుంటూ వస్తోన్న డీడీఎస్ మహిళల నుంచి స్ఫూర్తిని అందుకుని అందరూ ఈ వీరి బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దివ్య మాట్లాడుతూ... చాలా దేశాల్లో విత్తనాలు దాచుకునే హక్కులు లేవన్నారు. జన్యుమార్పిడి విత్తనాలతో ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రదర్శనకు అరుదైన రకాలు

దేశీయ విత్తనాలలో అరుదైన రకాలైన అత్తా కోడళ్ల జొన్నలు, నల్ల తొగరి, బుర్క తొగరి, తెల్ల శనగలు, నల్ల బెబ్బర్ల వంటి అంతరించిపోతున్న అరుదైన విత్తనాలను ప్రదర్శించారు. వీటితోపాటు కొర్ర, సజ్జ, సామ, మినుము, పెసర, సామ, ఉలవ, గడ్డి నువ్వు, తైద, పచ్చజొన్న, ఎర్రజొన్న తదితర రకాలు ప్రదర్శలో ఉంచారు.

ఆకట్టుకున్న అరుదైన విత్తన ప్రదర్శన



రైతు చంద్రమ్మకు ప్రథమ బహుమతి అందజేస్తున్న సామాజిక కార్యకర్త జ్యోతి పండాల్

అంతర్జాతీయ విత్తన వారోత్సవాలను పురస్కరించుకుని మహిళా రైతులు ప్రదర్శించిన అరుదైన చిరుధాన్యాల రకాలు ఆకట్టుకున్నాయి. జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాలకు చెందిన రైతులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు సంబంధించి న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఝరాసంగం మండలంలోని బిడకన్నె గ్రామానికి చెందిన జడల చంద్రమ్మ 58 విత్తన రకాలు ప్రదర్శించి మొదటి బహుమతి అందుకుంది. న్యాల్‌కల్ మండలంలోని గుంజోటి గ్రామానికి చెందిన కర్నె నర్సమ్మ 56 విత్తన రకాలను ప్రదర్శించి రెండో బహుమతి, ఝరాసంగం మండలంలోని పొట్‌పల్లి గ్రామానికి చెందిన మొగులమ్మ 55 విత్తన రకాలను ప్రదర్శించి మూడో బహుమతిని అందుకున్నారు.

సొంత పొలంలో సాగు చేస్తున్నా



తనకు ఉన్న సొంత పొలంలో చిరు ధాన్యాలు, పప్పు దినుసులు, కూర గాయలు సాగు చేస్తున్నా. 60 రకాల వరకు విత్తనాలు, 15 రకాల వరకు దేశీ కూరగాయలు పండిస్తున్నా. న్యాల్‌కల్, హద్నూర్ తదితర అంగళ్లకు వెళ్లి కూరగాయలు అమ్ముకుంటున్నా. విత్తనాలు నిల్వపెట్టి సాగు చేస్తున్నా. మిగతావి తోటి రైతులకు ఇస్తున్నా.

-నర్సమ్మ, రైతు-గుంజోటి

రెండెకరాల్లో అనేక రకాలు



రెండెకరాల్లో 55కు పైగా రకాల చిరుధాన్యాలను పండిస్తున్నా. వాటినే విత్తనాలుగా ఉపయోగించుకుంటున్నాను. రైతులు తన దగ్గరకు వచ్చి విత్తనాలు తీసుకెళ్తారు. వానాకాలం, యాసంగి విత్తనాలు నిల్వపెట్టుకుంటాను.

-మొగులమ్మ, రైతు, పాట్‌పల్లి

58 రకాల ప్రదర్శించా



తనవద్ద నిల్వచేసి పెట్టుకున్న 58 రకాల విత్తనాలను ప్రదర్శనకు పెట్టాను. అందులో అరుదైన రకాల విత్తనాలు కూడా ఉన్నాయి. ప్రతి ఏటా విత్తనాలు వేసుకుని పంట వచ్చాక వాటిలో నాణ్యమైనవి ఎంపిక చేసి విత్తనంగా నిల్వ చేస్తాను.

-చంద్రమ్మ, రైతు,బిడకన్నె

క్లుప్తంగా

పుస్తెలతాడు అపహరణ



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించుకెళ్లిన ఘటన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో మంగళవారం చోటు చేసుకుంది. చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన వనపర్తి భాగమ్మ ఆలయ పరిసరాల్లో కిరాణం, జనరల్ స్టోర్‌ను నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. రోజూ మాదిరిగా మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్వామి వారిని దర్శించుకొని వచ్చి షాప్‌ను ఓపెన్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మెడలోంచి ఐదు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

తొగుట(దుబ్బాక): దీపంతో ఇల్లుకు నిప్పంటుకొని కాలిబూడిదైన ఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నాయిని ఎల్లవ్వ ఉదయం ఇంట్లో దేవుడి చిత్రపటం వద్ద దీపం వెలిగించి బయటకు వెళ్లింది. ఈ ప్రమాదవశాత్తు దీపం కిందపడి బట్టలకు మంటలు అంటుకున్నాయి. పరిస్థితిని గమనించిన గ్రామస్తులు అప్రమత్తమై సిద్దిపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలార్పివేశారు. ఈ ఘటనలో రూ.3 వేలు నగదు, బట్టలు, బియ్యం, వంట సామగ్రితోపాటు కొత్తగా ఇల్లు నిర్మించుకునేందుకు చేయించుకున్న దర్వాజలు, కిటికీలు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య



మన్నె జ్యోతి(ఫైల్)

వర్గల్(గజ్వేల్): కడుపునొప్పి భరించలేక తాళలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వర్గల్ మండలం అంబర్‌పేటలో చోటు చేసుకుంది. గౌరారం పోలీసుల కథనం మేరకు.. అంబర్‌పేటకు చెందిన మన్నె శ్రీనివాస్, రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురికి ఏడాదిన్నర కిందట వివాహం కాగా చిన్న కూతురు జ్యోతి(17) మెదక్ జిల్లా కూచారం కస్తూర్బా గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. ఇటీవలె ఫస్టియర్‌లో 439 మార్కులు సాధించింది. సెలవులు కావడంతో ఇంటివద్దే ఉంటుంది. కొంత కాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న జ్యోతి మంగళవారం సాయంత్రం నొప్పి తాళలేక గ్రామ సమీప తోటలో మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి మందలించాడని యువకుడు

మద్దూరు(హుస్నాబాద్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బచ్చల చంద్రకాంత్(24) కొద్ది రోజులుగా ఏ పని చేయకుడా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఏ పని చేయడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బలరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్(20) మంగళవారం మధ్యాహ్నం ఇంటి పరిసరాల్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా మర్కూక్ పాఠశాల ఉపాధ్యాయులు



చిన్న బ్రహ్మయ్య



ఓంకార్ రాధాకృష్ణ

మర్కూక్(గజ్వేల్): రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా మర్కూక్ పాఠశాల ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మండలంలోని దారకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య, ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ గురువారం ఎంపికయ్యారని మండల విద్యాధికారి వెకట్‌రాములు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో 641 మంది దరఖాస్తు చేసుకోగా 27న రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ వారు హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. 152 మంది ఎంపికయ్యారని మర్కూక్ మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాలల ఉపాధ్యాయుల వారికి అభినందనలు తెలిపారు.






కోతలు మొదలు.. ధాన్యం బారులు

సంగారెడ్డి జిల్లాలో ఇటీవలె ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. వరి కోతలు ప్రారంభం కావడంతో సంగారెడ్డి, కంది పరిసర ప్రాంతాల్లోని రైతులు ఇప్పుడిప్పుడే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. దానితో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలతో ట్రాక్టర్లు బారులు తీరాయి .

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి





అధికారుల నిర్లక్ష్యం.. సంచారం లేని వాహనం

సీజనల్ వ్యాధుల కాలంలో మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వారధిలా ఉన్న 104 సంచార వాహనాలు మూలనపడ్డాయి. కలెక్టరేట్‌లోని ఐదు వాహనాలు నిరుపయోగంగా మారాయి. చిన్నపాటి మరమ్మతులు చేసే వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తుప్పు పట్టి పనికి రాకుండాపోతున్నాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

కనిపించని కల్లాలు..

రోడ్లపైనే వడ్లు

రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్న రైతులు

- కల్లాల కొరతతో నానా అవస్థలు
- వాహదారులకు తప్పని ఇబ్బందులు
- నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



అల్లీపూర్ వద్ద రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై పోసిన పంట కుప్పలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంటను ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు తారు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. చేతికొచ్చిన పంట దిగుబడుల్లో తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్నారు. ధాన్యం కుప్పలు రోజుల తరబడి ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

వాహనదారులకు ముప్పు..

యేటా సీజన్ రాగానే రైతులు రోడ్లపై ఇరువైపులా పంట కుప్పలు పోయడంతో రహదారులు కల్లాలుగా మారాయి. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రాత్రి పూట వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. నిత్యం పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కానీ కల్లాలు లేకనే రోడ్లపై పంటను ఆరబెట్టాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

కలగానే కల్లాలు..

గతంలో ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై కల్లాల నిర్మాణానికి దరఖాస్తులను స్వీకరించింది. కొన్ని గ్రామాల్లో పూర్తయినా బిల్లులు రాలేదని, కొన్ని అసంపూర్తిగానే మిగిలిపోయాయని రైతులు వాపోతున్నారు. గత మూడేళ్లుగా కల్లాల పథకం నిలిచిపోవడంతో అర్హులైన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు రైతుల కష్టాలు గుర్తించి పథకాన్ని పునరుద్ధరిస్తే మేలు జరిగే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు



దుబ్బాక : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు రోడ్లపై పోయకుండా కల్లాల్లో ఆరబెట్టుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ధాన్యాన్ని రోడ్లపై పోయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికే రోడ్లపై పోసిన ధాన్యం కుప్పలను వాహనాలు ఢీ కొట్టి మృతి చెందిన ఘటనలు చాలా ఉన్నాయన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రైతులు ప్రమాదాలకు కారణం కావొద్దన్నారు. ఇప్పటికే రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దంటూ రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనికి రైతులు సహకరించాలని సీఐ కోరారు.

–సీఐ శ్రీనివాస్

అరుదైన 'వీరగల్లు' శిల్పాలు

- సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో వెలుగులోకి
- పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు శ్రీనివాస్





పులివేట వీరగల్లుల శిల్పాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలోని గౌరయపల్లి గ్రామంలో పులివేట వీరగల్లుల రాతి శిల్పాలు ఉన్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వాటిని పరిశీలించి 17 శతాబ్దానికి చెందినవిగా పేర్కొన్నారు. కన్నడ భాషలో హళిబేటె అని పిలిచే ఈ పులివేట వీరగల్లుల శిలా రూపాలు తెలంగాణలో మూటకోడూర్, నిజామాబాద్, గోసేపల్లి, అమ్మనబోలు వంటి ప్రదేశాల్లో గతంలో లభించాయని పేర్కొన్నారు. గ్రామం మీద పెద్ద పులిదాడి చేసిన సమయంలో వీరుడు వాటితో పోరాడి ప్రజల్ని కాపాడి మరణం పొందిన సందర్భంగా వేసిన వీరశిలలుగా గుర్తించినట్లు చెప్పారు. ఈ మూడు రాతి శిల్పాల్లో రెండు పులితో వేటాడుతున్నవి, మూడవది శైవ భక్తుడు తన సిగముడిని వంచిన వెదురుగడకోసకు కట్టుకొని అంజలిపట్టి యోగాసనం కుర్చున్నట్లు తెలిపారు. వీటి శిల్పశైలీని బట్టి రాష్ట్ర కుటుల కాలం నాటి శిల్పాలుగా పేర్కొన్నారు. ఆయన వెంట కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన హరగోపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు 'రుతు ప్రేమ'

డీపీఓ దేవకీదేవి



మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

కోహెడరూరల్(హుస్నాబాద్): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రుతు ప్రేమ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీపీఓ దేవకీదేవి అన్నారు. మండలంలోని సముద్రాల గ్రామంలో రుతుప్రేమ కార్యక్రమంలో భాగంగా మెన్‌స్ట్రువల్ కప్, క్లాత్‌ప్యాడ్‌ల వినియోగంపై మహిళకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ మనుగడను శాసించేది రుతుచక్రమని రుతు చక్రం లేకపోతే జీవనమే లేదని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కెమికల్స్ కలిగిన ప్యాడ్ వల్ల మహిళల ఆరోగ్యానికే కాదు, పర్యావరణానికి కూడా ప్రమాదమేనని అన్నారు. క్లాత్ ప్యాడ్స్ మెన్ స్ట్రువల్ కప్ ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. మెన్‌స్ట్రువల్ కప్ 8 నుంచి 10 ఏళ్ల వరకు వాడొచ్చని ఇవి సురక్షితమైనవని, ఆరోగ్యకరమైనవని అన్నారు. నెలనెలా ప్యాడ్స్ కొనాల్సిన అవసరం లేదని, అలా ప్రతీ మహిళకు ఏటా రూ.1,200 వరకు ఆదా అవుతుందన్నారు. అనంతరం మహిళలు, యువతులకు ఉచితంగా మెన్ స్ట్రువన్ కప్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెట్విన్ కో ఆర్డినేటర్ అమీనా, ఇన్‌చార్జి ఎంపీఓ శోభ, పంచాయతీ కార్యదర్శులు నిహారిక, నజియా, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

వరి కోత యంత్రం దహనం



కాలిపోయిన వరి కోత యంత్రం

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తులు వరి కోత యంత్రంకు నిప్పంటించి దహనం చేశారు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లగిశెట్టి వెంకటేశం, ఎస్టీ జహీర్ కలిసి కొన్నేళ్ల కిందట అప్పులు చేసి వరి కోత యంత్రంను కొనుగోలు చేశారు. సోమవారం రాత్రి వరకు మద్దూరి నారాయణరెడ్డి వరి పంటను కోసి సమీపంలో మరి కొందరి రైతుల పంటను కోసేది ఉండటంతో యంత్రంను నారాయణరెడ్డి బావి వద్దే ఉంచారు. మరుసటి రోజు వెళ్లే సరికి యంత్రం పూర్తిగా కాలిపోయి ఉంది. వ్యవసాయ బావి యజమానికి, గ్రామస్తులకు సమాచారం అందించారు. వరి కోత యంత్రంను దహనం చేసేందుకు డిజిల్ ట్యాంకరుపై ఎండు గడ్డిని వేసి నిప్పంటించగా డిజిల్ ట్యాంక్ పేలి కాలిపోయినట్లుగా నిర్ధారించారు. సుమారు రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఈ విషయమై కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంపై వెబినార్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం తెలుగు సాహిత్య అధ్యయనం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు తెలుగుపై పట్టు సాధిస్తే అనేక అవకాశాలున్నాయన్నారు. ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా సివిల్ సర్వీసెస్‌లో విజయాలు సాధించవచ్చన్నారు. డీటీపీ టైపింగ్, తెలుగు కరపత్రాలు, గూగుల్, వీకీపీడియాలో రచయితలుగా, తెలుగు అనువాదకులుగా ప్రూఫ్ రీడర్లుగా, పత్రికా సంపాదకులుగా, పరిశోధకులుగా రాణించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. కృత్రిమ మేధస్సును తెలుగులో ఉపయోగించుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త పిట్లదాస్, ఎస్ఆర్ఆర్ కరీంనగర్ కళాశాల తెలుగు విభాగాధ్యక్షులు డా.బూర్ల చంద్రశేఖర్, గజ్వేల్ కళాశాల తెలుగు విభాగాధ్యక్షులు డా. ఆర్ మహేందర్‌రెడ్డి, అధ్యాపకులు నారోజు వెంకటరమణ, చక్రహరిరమణ, బానోజు సంపత్‌తోపాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 14న లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి సాయిరమాదేవి

న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట కోర్టులో పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందులో క్రిమినల్, కాంపౌండబుల్, సివిల్, మోటార్ వాహన కేసులో రాజీ కుదిర్చి అధిక మొత్తంలో కేసులు రాజీ అయ్యేటట్లు చూడాలన్నారు. పోలీసులు, అధికారులు ఎక్కువగా కేసులు పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జయప్రసాద్, మిలింద్‌కాంబ్లి, సంతోష్‌కుమార్, తరణి, కాంతరావు, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు మండలంలో చేపట్టిన రూ.6.78 కోట్ల కూలి పనులు, రూ.3 కోట్ల 78 లక్షలకు సంబంధించి మెటీరియల్ పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి సిబ్బంది చదివి వినిపించారు. గోమారంలో ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శులు అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్ ఆరోపిస్తూ ఆందోళన చేశారు. గ్రామంలో చేపట్టిన పనులపై సమగ్ర విచారణ చేస్తామని జిల్లా అదనపు పీడీ రంగాచార్యులు చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. అవినీతికి పాల్పడిన పలువురు సిబ్బంది నుంచి రూ. 2.90 లక్షలు రికవరీ చేస్తామని అదనపు పీడీ, విజిలెన్స్ అధికారి శ్రీహరి పేర్కొన్నారు. అలాగే రూ.32 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సంపత్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, సీనియర్ క్వాలిటీ అధికారులు జ్యోతి, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్ ఉన్నారు. పలు గ్రామాల్లో కూడా అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.

నలుగురు అదృశ్యం

పరీక్ష రాసేందుకు వచ్చి విద్యార్థిని

గజ్వేల్‌రూరల్: పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామానికి చెందిన దుర్గని అంకిత గజ్వేల్ పట్టణంలో బాలుర హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు నానమ్మ లక్ష్మీతో కలిసి వచ్చింది. పరీక్షా కేంద్రం వద్ద నీళ్ల బాటిల్ తీసుకొస్తానని చెప్పి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సూరంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జీవన్‌పై అనుమానమున్నట్లు లక్ష్మీ గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంధువుల వద్దకు వెళ్లిన మహిళ

వెల్దుర్తి(తూప్రాన్) : ఇంటి నుంచి వెళ్లి మహిళ అదృశ్యమైంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని శేరీల గ్రామానికి చెందిన చల్ల కొమురమ్మ సుమారు నెలన్నర రోజుల కిందట చిన్నశంకరంపేట మండలం బాగిర్థిపల్లిలో బంధువుల పెళ్లికి వెళ్లింది. వివాహానికి హాజరైన అనంతరం కొద్ది రోజులు ఇతర బంధువుల వద్దకు వెళ్లి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం కొమురమ్మ కూతురు అలవేణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సామగ్రి కొనుగోలుకు వెళ్లి

నారాయణఖేడ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. నాగల్‌గిద్ద ఎస్ఐ బీ.సాయిలు కథనం మేరకు.. గ్రామానికి చెందిన తెనుగు అంజన్న (42) 28న కిరాణా సామగ్రి కొనుగోలు నిమిత్తం నారాయణఖేడ్‌కు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. అంజన్న భార్య సావిత్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జహీరాబాద్ టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం మేరకు.. బాగారెడ్డిపల్లికి చెందిన డీ.కేశప్ప రెండో కూతురు డీ.అశ్విని(20) పట్టణంలోని భవానీ మందిరం రోడ్డులో గల టైలర్ దుకాణంలో పని చేస్తుంది. ప్రతి రోజూ ఉదయం టైలరింగ్ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికొస్తుంది. 25న పనికి వెళ్లిన అశ్విని ఇంటికి రాకపోవడంతో బంధువల వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి కుశప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ప్రత్యేక శిబిరం.. ప్రధానోపాధ్యాయుడి ఔదార్యం

అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహణ

- గణితం, ఇంగ్లిష్, తెలుగు చేతి రాతతో పాటు సంస్కృతి సంప్రదాయాలపై శిక్షణ
- హెచ్ఎం లక్ష్మీనారాయణను అభినందిస్తున్న గ్రామస్తులు



శిక్షణ పొందుతున్న అచ్చంపేట విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ ప్రత్యేక శ్రద్ధతో వేసవి శిబిరం నిర్వహిస్తున్నాడు. 24 నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో తన పాఠశాలలో చదువుకుంటున్న పేద మధ్య తరగతి పిల్లలను ప్రైవేటు పాఠశాలలు దీటుగా చదివించాలన్న లక్ష్యంతో తానే చొరవ తీసుకొని ఈ శిబిరాన్ని ప్రారంభించాడు. సుమారు 40 మంది విద్యార్థులు ఈ శిబిరానికి హాజరవుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కొనసాగుతుంది. శిబిరంలో గణితం, ఇంగ్లిష్, తెలుగు, చేతి రాతతో పాటు సంస్కృతీ సాంప్రదాయాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. వేసవి నేపథ్యంలో స్కూళ్లకు సెలవులు రావడంతో ఇతర ఉపాధ్యాయులు వారి వారి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ మాత్రం ఎక్కడికి వెళ్లకుండా శిబిరం కొనసాగిస్తున్నాడు. విద్యార్థులు సైతం శ్రద్ధతో శిబిరానికి వచ్చి శిక్షణ పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సేవలు అభినందనీయం: ఎంఈఓ తారా సింగ్

అచ్చంపేట పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయం. విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాడు. శిక్షణ శిబిరాన్ని పలుమార్లు సందర్శించాను. ఇతర ఉపాధ్యాయులు సైతం ఇలాంటి కార్యక్రమాలు చేపడితే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చి దిద్దేందుకు అవకాశం ఉంటుంది.

ప్రైవేటుకు దీటుగా విద్య : లక్ష్మీనారాయణ



చేతి రాత శిక్షణ ఇస్తున్న హెచ్ఎం లక్ష్మీనారాయణ

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన కల్పించాలన్న లక్ష్యంతోనే అచ్చంపేట పాఠశాలలో వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించాను. అచ్చంపేట గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ఉండేందుకు గణితం, ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతి సాంప్రదాయాల శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఈ శిబిరంలో వెలికితీసి వారిని ప్రయోజకులను చేసేందుకు కృషి చేస్తున్నా. ఆట, పాటలు, డ్రాయింగ్, ఉపన్యాస, వ్యాస రచన, క్విజ్, జనరల్ నాలెడ్జ్ లో సైతం శిక్షణ ఇస్తున్నాం.